

అనగనగా ఓ ఊరు.. 10లో▸

అదో ఏళ్లనాటి గిరిజన పల్లె.. అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలిన ఆ ఊరికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడమూ కష్టతరమే.

సొనాల గ్రామస్తుల చలో నిర్మల్

బోథ్: సొనాల గ్రామాన్ని మండలంగా ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని మండల సాధన సమితి సభ్యులు రాంరెడ్డి కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి ఆదివారం నిర్మల్‌కు విచ్చేస్తున్న సందర్భంగా కలిసేందుకు గ్రామస్తులమంతా చలో నిర్మల్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



'బడిబాట' ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడిబయట పిల్లలను బడిలో చేర్చే దిశగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం నుంచి ఈనెల 9వరకు మొదటి విడత, 12 నుంచి 17వరకు రెండో విడత బడిబాట ఉంటుందని వెల్లడించారు. స్థానిక నాయకులు సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, మున్సిపల్ కమిషనర్ శైలజ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సతీశ్, ప్రహ్లాద్, శ్రీను, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు స్విమ్మింగ్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 5న స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కొమ్ము కృష్ణ ప్రకటనలో తెలిపారు. ట్యూబ్‌తో గ్రూప్–1 విభాగంలో ఐదు నుంచి ఏడేళ్ల లోపు, గ్రూప్–2 విభాగంలో 8 నుంచి పదేళ్ల లోపు, గ్రూప్–3 విభాగంలో 11 నుంచి 14 ఏళ్ల లోపు బాల బాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ట్యూబ్ లేకుండా గ్రూప్–1లో ఐదు నుంచి ఏడేళ్ల లోపు వారికి, 8 నుంచి పదేళ్ల లోపు వారికి, 11 నుంచి 14 ఏళ్ల లోపు వారికి, 15 నుంచి 17ఏళ్ల లోపు బాల బాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 9494945402 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేడుకలు ఊరూరా ఘనంగా నిర్వహించాలి




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండగను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈనెల 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండగను ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రతీ నియోజకవర్గంలో 1000 మందితో సభ నిర్వహించాలన్నారు. అలాగే 8న ఆయా గ్రామ పంచాయతీల్లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల వద్ద సాయంత్రం 5 గంటలకు చెరువుల పండుగ నిర్వహించాలన్నారు. గ్రామాల నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా బయలుదేరాలన్నారు. చెరువుగట్టు వద్ద పండుగ వాతావరణం కనిపించేలా ముగ్గులు, తోరణాలతో అలంకరించాలన్నారు. ఇరిగేషన్‌లో వచ్చిన ప్రగతి, పెరిగిన పంటల ఉత్పత్తిపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులు కలిసి సహపంక్తి భోజనాలు చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో సహాయ శిక్షణ కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

ఎదులాపురం: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్ బుద్ధ విహార్ వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ కార్మికులు, వర్కర్లతో కలిసి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఇందులో భాగంగా ఈనెల 6, 7 తేదీల్లో మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కుప్పి.. మంజూరేనా



కడెం ప్రాజెక్ట్‌కు పరీవాహక ప్రాంతమైన కుప్పి (ఈ పరీవాహక ఎగువ ప్రాంతంలోనే కుప్పి ప్రాజెక్ట్ నిర్మాణం)

- సీఎం నిర్మల్ టూర్‌లో ప్రకటించే అవకాశం
- వరాల జాబితాలో చోటు
- ఏళ్లుగా నానుతున్న బహుళార్థక సాధక ప్రాజెక్టు

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల ఏడాదిలో కుప్పి ప్రాజెక్టుకు ముందడుగు పడుతున్నట్లు తెలుస్తోంది. నేడు నిర్మల్ జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై ప్రకటన చేయనున్నట్లు సమాచారం. సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభించేందుకు వస్తున్న ఆయన ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రకటించే వరాల జాబితాలో కుప్పి సైతం ఉన్నట్లు తెలుస్తోంది. తద్వారా ఎనిమిదేళ్లుగా నానుతున్న ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మించేది ఆదిలాబాద్ జిల్లాలో అయినప్పటికీ దీని నుంచి నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు పూర్తి ఆయకట్టు స్థిరీకరిండమే లక్ష్యం. ఈక్రమంలోనే సీఎం దీనిపై ప్రకటన అక్కడి నుంచే చేయనున్నట్లు సమాచారం.

రైతుల సమస్య పరిష్కరించేందుకు..

బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. అయితే ఈ ప్రాజెక్టు జూలై నుంచి సెప్టెంబర్‌లో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. ప్రతి పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాలకు మాత్రమే కడెం ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎగువన ఉన్న

కుప్పి స్వరూపం ఇలా..	
నీటి నిల్వ సామర్థ్యం	5.30 టీఎంసీలు
నీటిమట్టం	394.00 మీటర్లు
జలమార్గం	7 రేడియల్ గేట్లు సిల్ప్‌వేతో నిర్మాణం

పరివాహక ప్రాంతమైన కుప్పి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రతిపాదించారు. కడెం ఆయకట్టుకు ఇది అనుబంధంగా ఇది ఉంటుంది. ఇది పూర్తయితే రైతుల సమస్య పరిష్కారం అవుతుందనే ఆలోచనతో దీన్ని చేపడుతున్నారు.

అటవీ సంపద కారణంగా..

కడెం ప్రాజెక్ట్‌ను 1958లో నిర్మించారు. 7.20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌కు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్పి గ్రామం నుంచి నీటి పరివాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్ట్‌కు చేరుతుంది. బచావత్ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ కడెం వద్ద అటవీ సంపద దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతోనే ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్న కుప్పి వద్ద ప్రాజెక్ట్ నిర్మాణానికి బీజం వేసింది. ఇందులో భాగంగానే కుప్పి బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మించాలని తలపెట్టారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం వంటి ప్రయోజనాలతో దీన్ని చేపట్టాలని యోచిస్తున్నారు.

ప్రధాన ప్రయోజనాలు..

- మూడు మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి
- బోథ్ నియోజకవర్గంలో భవిష్యత్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా కొత్తనీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం ఎక్కువ సమయం ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకం ద్వారా ఆదాయం లభిస్తుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరి నదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

తొమ్మిదేళ్ల తర్వాత మోక్షం..

2015 జూన్‌లో నేరడిగొండ సమీపంలోని కుప్పి గ్రామం వద్ద బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నివేదిక కోరింది. డీపీఆర్ తయారు కోసం రూ.1 కోటి 47 లక్షల పరిపాలన ఆమోదం ఇచ్చింది. ఈ పనిని శ్రీరామచంద్ర ఇంజినీరింగ్ సర్వే కన్సల్టెంట్‌కు అప్పగించారు. ఏజెన్సీ సర్వే పనులు పూర్తి చేసి 2016 ఏప్రిల్‌లో డీపీఆర్ సమర్పించింది. దీనికి ప్రభుత్వం పరిపాలన పరమైన ఆమోదం అప్పట్లోనే తెలిపింది. దీన్ని కడెం ప్రాజెక్ట్‌కు నిల్వ, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగించడం కోసం నిర్మించాలని స్పష్టం చేసింది. 2020–21 నుంచి మూడుసార్లు డీపీఆర్ మారుతూ వచ్చింది.

సంవత్సరం	డీపీఆర్ అంచనా వ్యయం
2020–21	రూ.846.737 కోట్లు
2021–22	రూ.900 కోట్లు
2022–23	రూ.1265 కోట్లు

అనౌన్స్‌మెంట్ లిస్టులో ఉంది..

కుప్పి ప్రాజెక్ట్‌పై ప్రభుత్వానికి ఇదివరకే సవరించిన అంచనా వ్యయాలు పంపించాం. నిర్మల్ టూర్‌లో సీఎం అనౌన్స్‌మెంట్ లిస్టులో కుప్పికి చోటు కల్పించారు.

– విఠల్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డివిజన్–2, జలవనరుల శాఖ, ఆదిలాబాద్

నేడు నిర్మల్‌కు కేసీఆర్

- ముఖ్యమంత్రిగా తొలిసారి రాక..
- కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్ ప్రారంభం..
- మరో ఏడు కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- 'క్రషర్‌గ్రౌండ్'లో బహిరంగసభ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ
- గులాబీమయమైన నిర్మల్



ప్రారంభానికి ముస్తాబైన నిర్మల్ కలెక్టరేట్ భవనం

నిర్మల్: ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి ఆదివారం నిర్మల్ జిల్లాకు వస్తున్నారు. 2018, నవంబర్ 22న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఖానాపూర్, నిర్మల్,భైంసా బహిరంగసభల్లో పాల్గొన్నారు. సీఎం హోదాలో జిల్లాకు అధికారిక పర్యటన కోసం రావడం ఇదే తొలిసారి. జిల్లాకేంద్రంలో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మరో ఏడు కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొంటారు. అధికారిక లెక్కల ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం జిల్లాకు వస్తారని సమాచారం. కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలకడంతోపాటు కలెక్టరేట్ ప్రారంభోత్సవం, అనంతరం నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారం రోజులుగా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్ కుమార్ పర్యటనకు సంబంధించిన పనులను నిరంతరం పరిశీలిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలతోపాటు బహిరంగసభకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సీఎం పాల్గొనే కార్యక్రమాలివే..

హైదరాబాద్ నుంచి నేరుగా నిర్మల్ చేరుకున్న తర్వాత సీఎం కేసీఆర్ ముందుగా స్థానిక కొండాపూర్ బైపాస్ వద్ద నిర్మించిన బీఆర్ఎస్ భవన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం సమీకృత కలెక్టరేట్(ఐడీఓసీ) ప్రారంభంతోపాటే మిగతా పనులకు అక్కడి నుంచే శంకుస్థాపను, ప్రారంభోత్సవాలు చేస్తారు.

- ఎల్లపెల్లి శివారులో రూ.56 కోట్లతో రోడ్లు భవనాలశాఖ నిర్మించిన ఐడీఓసీ(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్)ను ప్రారంభిస్తారు.
- నిర్మల్ జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీకి సంబంధించిన భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- సారంగాపూర్ మండలం చించోలి(బి)లో నిర్మించిన మైనార్టీ బాలుర గురుకులాన్ని ప్రారంభిస్తారు.
- తెలంగాణ డెయిరీకి సంబంధించిన మినరల్ మిక్చర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు.
- గిరిజన సంక్షేమశాఖ ద్వారా మూడు నియోజకవర్గాల్లో నిర్మించిన బీటీరోడ్లు, వంతెనలను ప్రారంభిస్తారు.
- గిరిజన సంక్షేమశాఖ జిల్లాకేంద్రంలో నిర్మించిన బంజారాభవన్‌ను ప్రారంభిస్తారు.

క్రషర్‌గ్రౌండ్‌లో బహిరంగసభ..

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం కొత్త కలెక్టరేట్ రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొంటారు. దాదాపు లక్ష మంది హాజరయ్యేలా ఈ సభాప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్ సభ ఏర్పాట్లు, జనసమీకరణను పర్యవేక్షించారు. ఎన్నికలకు ముందు జరగనున్న సీఎం సభ కావడంతో భారీగా జనసమీకరణకు జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు నాయకులూ ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మల్‌తోపాటు ముధోల్, ఖానాపూర్ నుంచి భారీగా జనాన్ని తరలించేలా చర్యలు చేపట్టారు.

పటిష్ట బందోబస్తు..

ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు బలగాలను మోహరించారు. సీఎం ప్రారంభించే కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్, ఇతర కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముందస్తుగా సూచించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఇతర నేతలు, మీడియా ప్రతినిధులకు పర్మిషన్ లేదు. బహిరంగసభకు మాత్రమే అందరికీ అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈమేరకు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు.

గులాబీమయం..

చాలారోజుల తర్వాత జిల్లా కేంద్రంలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఎటుచూసినా గులాబీ జెండాలు, సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికే ఫ్లెక్సీలతో నింపేశారు. సీఎం పర్యటన సాగే ప్రాంతమంతా గులాబీమయమైంది. కొత్త కలెక్టరేట్‌నూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల లైటింగ్, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అధికారుల చాంబర్లనూ ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కలెక్టరేట్‌తోపాటు, మిగితా పనులకు సంబంధించిన శిలాఫలాకాలనూ అక్కడే ఏర్పాటు చేశారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీళ్లు, బటర్‌మిల్క్ అందించనున్నారు.

అన్నదాత సంక్షేమానికి కృషి



ఎడ్లబండిపై ర్యాలీగా వస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రామన్న తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్
- ఘనంగా రైతు దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మావల మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతుదినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా మావల జీపీ నుంచి రైతువేదిక వరకు ఎడ్లబండ్లపై ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. జిల్లాలో రైతు బంధు ద్వారా 1,47,161 మంది రైతులకు రూ. 2363.67 కోట్లు వారి ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. రైతుబీమా ద్వారా వివిధ కారణాలతో మృతి చెందిన 3,088 మంది రైతులకు సంబంధించి రూ.154.4 కోట్లు వారి నామినీ ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా 6,643 మంది రైతులకు రూ.27కోట్లతో ట్రాక్టర్లు, స్ప్రేయర్లు వంటి పరికరాలు సబ్సిడీ రూపంలో అందించామన్నారు. 1,81,933 మంది రైతులకు పంట నష్ట పరిహారం కింద రూ.86 కోట్లు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. జిల్లాలో 101 రైతు వేదికలు నిర్మించి ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడి పదో సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా 21 రోజుల పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. అనంతరం పలువురు రైతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జెడ్పీటీసీ వనిత, ఎంపీపీ సంగీత, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఇమ్రాన్, ఎంపీడీవో అరుణ, సర్పంచ్ ప్రమీల, ఎంపీటీసీ ఈశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

రైతుకు పెరిగిన గౌరవం

బజార్‌హత్నూర్: తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించిన అన్నదాతకు గౌరవం పెరిగిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బజార్‌హత్నూర్, పిప్రీ, మోర్ఖండి, చందునాయక్‌తండా, టెంబి, దేగామ క్లస్టర్ రైతు వేదికల్లో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతు అనుబంధ పథకాలతో సాగు భూములకు డిమాండ్ పెరిగిందన్నారు. అనంతరం రైతులకు భోజనం ఏర్పాటు చేయగా ఆయన స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సయ్య, తహసీల్దార్ సోము, ఎంపీడీవో చౌహాన్ రాధ, సర్పంచ్‌లు లావణ్య, గంగ, ఎంపీటీసీ తీరుమల, ఏవో ప్రమోద్‌రెడ్డి, ఎంపీవో మహేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: అన్నదాత అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ట్రెయినీ సహాయ కలెక్టర్ శ్రీజ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవం కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌సింగ్, ఏడీఏ రాంకిషన్, సర్పంచ్ సునీత పాల్గొన్నారు. ముఖరా(కె)లో సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల ర్యాలీ చేపట్టారు.

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

నార్నూర్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అన్నదాత సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తూ రైతు పక్షపాతిగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. నార్నూర్, బాబేఝరి, తాడిహత్నూర్, మహాగావ్ గ్రామాల్లో గల రైతు వేదికల వద్ద శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మహాగావ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేసేందుకు సీఎం కేసీఆర్ అనునిత్యం పాటుపడుతున్నారు. తొమ్మిదేళ్లలో అమలు చేసిన కార్యక్రమాలే నిదర్శనమన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

కార్యక్రమంలో ఎంపీపీ మోతుబాయి, సర్పంచ్ యశ్వంతరావు, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో రమేశ్, ఏవో రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు యునస్ అక్బానీ, ఆలిండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'అమృత్'ధార



పట్టణంలో విలీనమైన కేఆర్‌కే కాలనీ

- మున్సిపల్‌లో తీరనున్న దాహార్తి
- రూ.95.5 కోట్ల నిధులు విడుదల
- ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల విస్తరణ
- విలీన కాలనీల్లో తప్పనున్న నీటి తిప్పలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన కాలనీల్లో ఇక తాగునీటి సమస్య దూరం కానుంది. ఆయా కాలనీల ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు రూ.95.5 కోట్ల నిధులు విడుదల చేసింది. నాలుగు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు పట్టణంలో విలీనమై నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా పంచాయతీ స్థాయిలోనే నీటి సరఫరా జరుగుతుంది. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్నా ఆయా కాలనీల ప్రజల అవసరాలకు ఇవి ఏ మాత్రం సరిపోవడం లేదు. ఫలితంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితిని దూరం చేసి ప్రజల అవసరాలకు తాగునీరు అందించేలా కేంద్రం ఈ పథకంను తీసుకొచ్చింది.

తీరనున్న దాహార్తి ఇక్కట్లు

మావల మేజర్ గ్రామపంచాయతీలో ఉన్న దుర్గానగర్, పిట్టలవాడ, రాంనగర్, దస్నాపూర్, కేఆర్‌కే కాలనీ, 170 సర్వేనంబర్ కాలనీ, టీచర్స్‌కాలనీ, కోజాకాలనీ, గ్రామ పంచాయతీలుగా కొనసాగిన రాంపూర్, అనుకుంటతో పాటు బంగారుగూడ, బట్టిసావర్గాం పంచాయతీ పరిధి లోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలు మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. నాలుగేళ్లవుతున్నా ఈ కాలనీల్లో ఇంకా జీపీ మాదిరిగానే తాగునీటి సరఫరా కొనసాగుతోంది. దీంతో స్థానికులకు వేసవిలో నీటిఇక్కట్లు తప్పడం లేదు. ఈ సమస్యను దూరం చేసేలా, భవిష్యత్ తరాలకు తగ్గట్లుగా నీటి సామర్థ్యం పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు విడుదల చేసింది. దీంతో ఆయా కాలనీల్లో తాగునీటి సమస్య దూరమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

మున్సిపాలిటీకి మంజూరైన నిధుల వివరాలు	
మొత్తం నిధులు	రూ.95.5 కోట్లు
ఇందులో కేంద్రం వాటా	రూ. 29.50 కోట్లు
రాష్ట్రం వాటా	రూ. 52.42 కోట్లు
15వ ఆర్థిక సంఘం	రూ.6.57 కోట్లు
మున్సిపల్ వాటా	రూ.7.01కోట్లు

చేపట్టనున్న పనులివే..

మున్సిపల్ విలీన కాలనీల్లో జనాభా ప్రతిపాదికన, భవిష్యత్ తరాల అవసరాలకు సరిపడేలా తాగునీటి వసతి కల్పించనున్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం రోజుకు ఒక్కో వ్యక్తికి 135 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే విలీన కాలనీల్లో ఇప్పటికి జీపీ నిబంధనల ప్రకారం 100 లీటర్ల చొప్పునే సరఫరా చేస్తున్నారు. అయితే మున్సిపల్ నిబంధనల ప్రకారం తాగునీటిని అందించేలానే ఉద్దేశంతో కేంద్రం నిధులను విడుదల చేసింది. అమృత్ 2.0 కింద కొత్తగా పది తాగునీటి రిజర్వాయర్లను నిర్మించనున్నారు. 40కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇంటింటికీ కులాయి కనెక్షన్లలో భాగంగా 5వేల నల్లాలను ఏర్పాటు చేసేదిశగా పనులు ప్రతిపాదించారు. వీటికి ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించేలా ప్రజారోగ్యశాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నెలాఖరులోగా టెండర్ ప్రక్రియ పూర్తి

ఆదిలాబాద్ మున్సిపల్‌కు అమృత్ 2.0 కింద నిధులు విడుదలయ్యాయి. పట్టణంలోని విలీనకాలనీల్లో చేపట్టనున్న తాగునీటి సరఫరా పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం. అగ్రిమెంట్లు ఖరారయ్యాక సెప్టెంబర్ లేదా అక్టోబర్ నుంచి పనులు ప్రారంభిస్తాం. ఈ పథకంతో విలీన కాలనీల తాగునీటి సమస్య దూరం కానుంది.– గంగాధర్, ప్రజారోగ్యశాఖ ఈఈ

క్లుప్తంగా

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ బాలకిషాన్‌

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన బ్యాగరి రవి ఇల్లు శుక్రవారం రాత్రి కరెంటు షాక్‌తో పాక్షికంగా దగ్ధమైంది. శనివారం ఆర్‌ఐ బాలకిషాన్‌ కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఆయన వివరాల ప్రకారం... రవి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్నారు. ఇంట్లో నుంచి మంటలు రావడంతో గమనించిన రవి కుటుంబీకులు స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.3లక్షల 50వేల ఆస్తినష్టం వాటిల్లింది.

మట్కా స్థావరంపై దాడి


పట్టుబడిన మట్కా నిర్వాహకుడు

ఎదులాపురం: పట్టణానికి చెందిన చౌహాన్‌ అనిల్‌ అనే వ్యక్తి స్థానిక ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు సీసీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రమౌళి ఆధ్వర్యంలో మట్కా స్థావరంపై శనివారం సాయంత్రం దాడి చేశారు. మట్కా చిట్టీలు, రూ.4800 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెండవ పట్టణ పోలీస్‌ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి


దీపక్‌ సహారే(ఫైల్‌)

బేల: మండలంలోని జునోని గ్రామానికి చెందిన దీపక్‌ సహారే (35) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని జునోని గ్రామ శివారులోని రైతు లెన్‌గురే సతీష్‌ పొలంలో కొన్ని రోజులుగా వ్యవసాయ బావి నిర్మాణ సీసీ రింగుల పనులు కొనసాగుతున్నాయి. శనివారం దీపక్‌ పనికి వెళ్లాడు. పైభాగంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ బావిలో పడిపోయాడు. తోటి కూలీలు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. భార్య ఛాయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్‌ తెలిపారు.

టిప్పర్‌ ఢీకొని వ్యక్తి మృతి


గంగాధర్‌ మృతదేహం

సోన్‌: యువకుడు అల్పాహారం తినొద్దామని వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిన విషాద ఘటన మండలంలోని సిద్దులకుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిర్‌నాంచి గంగాధర్‌ (34) బుల్లెట్‌ బండిపై జాఫ్రపూర్‌ ఎక్స్‌రోడ్డు వద్ద టిఫిన్‌ చేద్దామని వెళ్లాడు. వంతెన దగ్గర ఎదురుగా వస్తున్న టిప్పర్‌ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్‌ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో నిర్మల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. అతడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోషం రవీందర్‌ తెలిపారు.

పిడుగుపాటుతో ఎడ్లు మృతి


మృతి చెందిన ఎడ్లు

ఇంద్రవెల్లి: పిడుగుపాటుకు గురై ఎడ్లు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని హీరాపూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని మారుతిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. రైతు పెందోర్‌ రాము, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మారుతిగూడ గ్రామానికి చెందిన పెందోర్‌ రాము ప్రతి రోజులాగానే శనివారం ఎడ్ల జతను మేతకు వదిలేశాడు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో పిడుగుపాటుకు గురై ఎడ్లు మృతి చెందాయి. ఎడ్ల జత మృతి చెందడంతో రైతు పెందోర్‌ రాము ఆందోళన చెందుతున్నాడు. వాటి విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

అదో ఏళ్లనాటి గిరిజన పల్లె... అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలిన ఆ ఊరికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. మండల కేంద్రం నుంచి మూడు వాగులు దాటి గంటపాటు ప్రయాణం చేస్తే ఆ పల్లెకు చేరుకోవచ్చు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడం కష్టతరమే. అలాంటి సమయాల్లో ఎందరో ఆదివాసీ అభాగ్యులు ప్రాణాలు వదిలారు. అయినా పట్టించుకునే దయార్ధ హృదయులు లేరు. నింగికి రాకెట్‌ను పంపించే అత్యాధునిక యుగంలో ఆ ఊరికి కనీసం ఫోన్‌ సిగ్నల్‌ కూడా రాని పరిస్థితి. చుట్టూ ఇబ్బందులున్నా.. ఎవరినీ నిందించకుండా వన్యప్రాణులతో స్నేహం చేస్తూ.. అడవితల్లి ఒడిలో అలరాలుతున్న 'ఇస్లాంపూర్‌'పై ప్రత్యేక కథనం. – జన్నారం



అనగనగా ఓ ఊరు..

- మౌలిక వసతులకు నోచుకోని తీరు..
- అభివృద్ధికి ఆమడ దూరంలో ఇస్లాంపూర్‌
- జనావాసాలకు 15 కిలోమీటర్ల దూరంలో గ్రామం
- రోడ్డు లేక రాకపోకలకు ఆదివాసీల ఇబ్బంది
- ప్రాణాలు పోతున్నా పట్టింపులేని అధికారులు


వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని తాడు సాయంతో పైకి లాగుతున్న దృశ్యం (ఫైల్‌)

ఇస్లాం స్థాపించిన గ్రామం

నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌ నియోజకవర్గం కడెం మండలంలోని ఇస్లాంపూర్‌ శతాబ్దాల క్రితం వెలసిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రజాకార్ల పాలనలో ఇస్లాం అనే వ్యక్తి ఆ గ్రామానికి వచ్చి అడవిలో తలదాచుకుని గిరిజనులతో మమేకం కావడంతో ఆ గ్రామానికి ఇస్లాంపూర్‌ అని పేరు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అడవిని నరికి సాగు చేసుకుని ఆదివాసీలు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో ఆదివాసీలు అడవి సంపద అయిన పుట్టతేనె, ఫలాలపై ఆధారపడి జీవించారు.

126 ఇండ్లు.. వెయ్యికి పైగా జనాభా

గ్రామంలో 60 గోండు కుటుంబాలు, 45 కొలాం కుటుంబాలు, 15 నాయకపోడ్‌ కుటుంబాలు, 6 నేతకాని కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. ఉడుంపూర్‌ గ్రామ పంచాయతీలోని ఈ గిరిజన గూడేన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది.

ఎటువెళ్లినా పది కిలోమీటర్లు..

దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎడ్లబండ్ల బాటలో రాకపోకలు సాగిస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని జన్నారం మండలం కవ్వాల్‌కు రావాలంటే 15 కిలో మీటర్లు, కడెం మండలం ఉడుంపూర్‌కు రావాలంటే 9 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిందే. రేషన్‌ సరుకుల కోసం ఉడుంపూర్‌, అవసరాల నిమిత్తం అత్యధికంగా గిరిజనులు జన్నారం మండల కేంద్రానికి రావాల్సిందే.

రోడ్డు లేక నరకయాతన..

వందల ఏళ్ల క్రితం ఏర్పడిన ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. దట్టమైన అడవులు ఉండడంతో అటవీశాఖ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే సర్కస్‌ ఫీట్లు వేయాల్సిందే. మూడు వాగులు దాటితే తప్ప జనావాసాల్లోకి రాలేని పరిస్థితి. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగితే మూడు నెలలపాటు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడినవారు వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. బైక్‌పై బలవంతంగా తీసుకెళ్లినా వాగులు దాటే లోగా ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు


అసంపూర్తిగా పాఠశాల భవనం

గ్రామంలో 36 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. లక్సెట్టిపేట నుంచి ప్రతిరోజు ఉపాధ్యాయుడు వచ్చి పాఠాలు బోధిస్తాడు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు స్తంభించడంతో మూడునెలల పాటు ఉపాధ్యాయుడు రాలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఎవరైనా చదువుకున్న వారితో లేదా వీవీని పెట్టుకుని పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. గ్రామానికి నూతన పాఠశాల భవనం ఆరేళ్ల క్రితం మంజూరైనా నేటికీ నిర్మాణం పూర్తికాలేదు. శిథిలావస్థలోని పాఠశాల భవనాన్నే గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్‌గా వినియోగిస్తున్నారు.

పట్టింపులేని పాలకులు, అధికారులు

గ్రామం ఏర్పడి వందల ఏళ్లు కావస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం మాత్రమే వస్తారని, ఆతర్వాత మర్చిపోతారని చెప్తున్నారు. ఇటీవల నిర్మల్‌ జిల్లా కలెక్టర్‌, ఖానాపూర్‌ ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, మా సమస్యలపై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఇస్లాంపూర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, చెరువులు నిర్మించడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


వాగులో చిక్కుకున్న బైక్‌ను బయటకు తీస్తున్న యువకులు(ఫైల్‌)


ఇస్లాంపూర్‌కు అడవి నుంచి వెళ్లే దారి ఇదే

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు...

ఎమ్మెల్యే రేఖానాయక్‌ చొరవతో ఉడుంపూర్‌ నుంచి ఇస్లాంపూర్‌ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు, చెరువుల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ అటవీశాఖ క్లియరెన్స్‌ లేకపోవడంతో ఆ నిధులు మళ్లిపోయాయి. మిషన్‌ భగీరథకు అనుమతి లేకపోవడంతో నల్లానీటిని ఆ గ్రామం నోచుకోలేదు. గ్రామ పంచాయతీలో నీటి ట్యాంకు నిర్మాణం ప్రారంభించారు. సామగ్రి తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామంలో ఉన్న మూడు చేతిపంపుల నీటిని తాగడానికి, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. అవి చెడిపోతే తాగునీటికి తంటాలు పడాల్సిందే.

ఎందరికో పురుడు పోసిన


గర్భిణులను ఆస్పత్రులకు తరలించే అవకాశం లేకపోవడంతో చాలామంది గిరిజన మహిళలకు నేనే పురుడు పోసిన. కొన్ని సందర్భాల్లో కొంతమంది చనిపోయారు. ఎప్పటి నుంచో ఉంటున్న మా ఊరికి సౌకర్యాలు లేవు. ఇక్కడే పుట్టిన వాళ్లం ఇక్కడే చస్తాం కానీ బయటకు వెళ్లలేం.
– జంగుబాయి, గ్రామస్తురాలు

రోడ్డు సౌకర్యం కల్పించాలి


నేను పుట్టినప్పటి నుంచి చూస్తున్న. మా ఊరు ఇలాగే ఉంది. ఇక్కడి నుంచి వేరే ఊరికి పోవడానికి మాకు రోడ్డు లేదు. వాగులు వంకలు దాటుకుంటూ అడవిలో నుంచి వెళ్లాలి. వానాకాలం రాకపోకలు ఉండవు. మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.
– కనక రాము, ఇస్లాంపూర్‌

చెరువు నిర్మించాలి


గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎలాంటి ఫలితం లేదు. గ్రామంలో చెరువు నిర్మాణం చేపడితే రైతులు పంటలు పండించుకుంటారు. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోవాలె.
– కనక విజయ్‌కుమార్‌, ఎంపీటీసీ

సమస్యలు తీర్చలేకపోతున్న


మా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం సీసీ రోడ్డు పనులతో పాటు వైకుంఠ దామం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌ యార్డులను మాత్రమే నిర్మించాం. గ్రామానికి రోడ్డు లేక సామగ్రి తేలేకపోతున్నాం. వాహనాలు ఇక్కడికి రావు. దీంతో అభివృద్ధి జరుగడం లేదు.
– కనక జైతు, సర్పంచ్‌

అటవీశాఖ క్లియరెన్స్‌ ఇవ్వడం లేదు


ఇస్లాంపూర్‌ అభివృద్ధికోసం ముఖ్యమంత్రితో మాట్లాడి రోడ్డు, చెరువు నిర్మాణం కోసం నిధులు తెప్పించా. కానీ అటవీశాఖ క్లియరెన్స్‌ ఇవ్వలేదు. నా సొంత నిధులతో సీసీరోడ్డు నిర్మించా. నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాం. నేడు జిల్లాకు రానున్న సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.
– అజ్మీరా రేఖానాయక్‌, ఎమ్మెల్యే

సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ


మాట్లాడుతున్న రామయ్య

ఖానాపూర్‌: జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం కేసీఆర్‌కు సీపీఐఎంఎల్‌ ప్రజాపంథా నిర్మల్‌, ఆదిలాబాద్‌ జిల్లాల కమిటీ కార్యదర్శి నందిరామయ్య బహిరంగ లేఖ రాశారు. 2014, 2018 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల మెనిఫెస్టో, బహిరంగ సభల ద్వారా, పార్టీ ప్రతినిధుల ద్వారా ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ అనేక హామీలు నెరవేరలేదని లేఖలో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి నిర్మల్‌ సభలో ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఖానాపూర్‌, కడెం మండలాల రైతుల జీవనాధారం సదర్మాట్‌ ప్రత్యేక కాలువను 7కిలో మీటర్ల మేర నిర్మిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఖానాపూర్‌లో రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు, 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎందుకు చేయలేదన్నారు. పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. పట్టణంలోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 400 డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిఏళ్లు గడుస్తున్న ఎందుకు పంపిణీ చేయడం లేదని మండిపడ్డారు. దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలపై సమాధానం చెప్పాలన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌: హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు పాటుపడాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరికుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన 21అడుగుల హనుమాన్‌ విగ్రహ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ విగ్రహ ఆవిష్కరణను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వాచనాలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూ ఇతర మతాలను గౌరవించాలన్నారు. హిందూ ధర్మం కూడా అదే నిర్దేశిస్తుందన్నారు. భారీ విగ్రహం ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. వేద పండితులు వారిచే పూజలు చేయించి ఆశీర్వాచనలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్‌ రాథోడ్‌, డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అజయ్‌, నాయకులు మిష్ఠు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌ నాయకులు లాలామున్న, లోక ప్రవీణ్‌రెడ్డి, ఆదినాథ్‌, ముకుంద్‌, ధోని జ్యోతి, చిల్కూరి జ్యోతిరెడ్డి ఉన్నారు.

సిమెంట్‌ లారీలు బోల్తా

- వేర్వేరు చోట్ల ఘటనలు
- త్రుటిలో తప్పిన ప్రమాదాలు


తాత్కాలిక వంతెన కింద పడిపోయిన సిమెంట్‌ లారీ

జైనథ్‌: మండలంలోని తరోడ సమీపంలో జాతీయ రహదారిపై ఇటీవల కుంగిన వంతెన కింద తాత్కాలిక వంతెనపై భారీ సిమెంట్‌ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. శనివారం ఉదయం మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌ వైపు సిమెంట్‌ లోడ్‌తో వస్తున్న లారీ ఇరుకుగా ఉన్న మట్టి రోడ్డు గుండా ప్రయాణించే సమయంలో అదుపు తప్పింది. లారీ వెనక భాగం నీళ్లలో పడిపోయింది. వెనక నుంచి భారీ వాహనాలు రాకపోవడం, డ్రైవర్‌ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ తాత్కాలిక వంతెన గుండా లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలకు అనుమతి లేకపోగా కొన్ని నెలలుగా అధికారులు అనుమతించడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు.

జైనథ్‌లో మరో లారీ..

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారిపై సిమెంట్‌ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఉదయం మహారాష్ట్ర నుంచి సిమెంట్‌ లోడ్‌తో ఆదిలాబాద్‌కు వస్తున్న లారీ అదుపు తప్పి కుడి వైపు మైలురాయిని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా లారీ బోల్తా పడింది. డ్రైవర్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ రోడ్డులో నిత్యం భారీగా సిమెంట్‌ లోడ్‌తో లారీలు తిరుగుతుండటంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

స్పందిస్తున్న మానవతావాదులు

సాక్షి స్పందన


సరుకులు అందిస్తున్న యూత్‌ సభ్యులు

బోథ్‌: 'ఇంటికి పెద్దదిక్కు..ఆ చిన్నారి' అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన వివేకానంద యూత్‌ సభ్యులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. రిమ్స్‌తో పాటు, నిర్మల్‌ జిల్లాలో ఆరోగ్యశ్రీ సిబ్బంది సోమవారం తండ్రి మలారిసింగ్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. కాగా ఫోన్‌పే ద్వారా కొంతమంది నగదును పంపించారు. కాగా మరికొంత మంది మానవతావాదులు స్పందించి వారి కుటుంబానికి అండగా నిలువాలని స్థానికులు కోరుతున్నారు.

అటవీశాఖ అధికారులపై ఆగ్రహం

- కల్వర్టు పనులు అడ్డుకున్న అటవీశాఖ అధికారులు..
- అడ్డుకున్న గ్రామస్తులు
- వెనుదిరిగిన అటవీశాఖ అధికారులు


అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని పోచంపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న నూతన కల్వర్టు పనులకు అటవీశాఖ నుంచి అనుమతులు లేవని ఇంద్రవెల్లి రేంజ్‌ అటవీ అధికారులు శనివారం పనులను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున కల్వర్టు పనులు జరుగుతున్న ప్రదేశానికి వచ్చి అటవీ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఎప్పటి నుంచో రాకపోకాలు సాగిస్తున్నామని, మీరు ఎలా పనులను అడ్డుకుంటారని ఆగ్రహంతో అధికారులను నిలదీశారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రైతు దినోత్సవంలో వాగ్వాదం


ప్రసంగాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్‌ నాయకులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల నాయకుడు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదంటూ ప్రస్తావించారు. ఈ సమావేశ వేదికపై ఉన్న కాంగ్రెస్‌ నాయకులు మండలంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం హయాంలో అనేక అభివృద్ధి పనులు చేశామని ప్రసంగాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎంపీడీవో భూమయ్య జోక్యం చేసుకుని ఇరువర్గాల నాయకులను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం సమావేశాన్ని కొనసాగించారు.